



క్రీడలు మానసిక వికాసానికి దోహదం

(6లో)

కట్టాలంటే కన్నీళ్లే

ప్రజాశక్తి - శ్రీకాకుళం, నౌపడ

గృహ నిర్మాణ సామగ్రి ధరలు రోజురోజుకూ పెరిగిపోవడంతో సామాన్యులు సొంత ఇల్లు నిర్మించుకోవడం కష్టమవుతోంది. కొందరు మధ్యలోనే పనులు నిలిపేస్తుంటే ఇంకొందరు అప్పులు చేసి ఏదో విధంగా పూర్తి చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులది ఇదే పరిస్థితి.

వైసిపి ప్రభుత్వం వచ్చాక అనుసరించిన ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 80వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. ఒక్క శ్రీకాకుళం మండలం పరిధిలోనే 20వేల మంది కనిపిస్తారు. ఇసుక ఇబ్బందులతో చాలా మంది ఉపాధి కోల్పోయి ఇతర రాష్ట్రాలకు వెళ్లిన పరిస్థితి. 2021 మార్చిలో రూ.280 ఉన్న సిమెంట్ బస్తా ధర 2022లో అదే సమయానికి రూ.350 నుంచి 380 ఉంది. ప్రస్తుతం రూ.400 నుంచి రూ.420 ధర కనిపిస్తోంది. ట్రాక్టర్ ఇసుక 2021లో రూ.4వేలు ఉంటే 2022లో రూ.5వేలు, ప్రస్తుతం 6వేలు, యూనిట్ కంకర రెండేళ్ల క్రితం రూ.2200 ఉంటే, ప్రస్తుతం రూ.3వేలు ఉంది. ఇనుము ధర 2021లో టన్ను రూ.50వేలు ఉంటే గతేడాది రూ.90వేలకు వెళ్లింది. తర్వాత కొంత తగ్గి రూ.65వేల నుంచి రూ.70వేలకు.. ప్రస్తుతం రవాణా ఛార్జీలు కలిపి కంపెనీని బట్టి రూ.75వేల వరకు పలుకుతోంది.



జగనన్న కాలనీల్లోనూ ఇదే సమస్య

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులపై అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. జిల్లాలో 76 వేల గృహాల నిర్మాణం లక్ష్యం కాగా, ప్రస్తుతం 14 వేలు గృహాలు పూర్తి చేశారు. డిసెంబరు నాటికి వంద శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది జరగలేదు. ప్రస్తుతం ఉగాదికి గడువు పెంచారు. అధిక ధరలతో నిర్మాణ వ్యయం పెరిగి లబ్ధిదారులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోదని, సాధారణంగా కట్టాలన్నా రూ.5 లక్షల వరకు అవుతోందన్నారు.

వినియోగం ఎంతంటే..

నిర్మాణ వ్యయం హెచ్చుతో భవన నిర్మాణ,

సామాన్యుడి సొంతింటి కలకు ఎన్నో కష్టాలు

అపార్టుమెంట్ ప్లాట్ల ధరలూ పెరుగుతున్నాయి. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణానికి సరాసరి 250 బస్తాల సిమెంట్ వాడుతున్నారు. సిమెంట్ ఖర్చు రూ.లక్ష, ఒకటిన్నర టన్ను ఇనుము దాదాపు రూ.1.20 లక్షలు అవుతుంది. ఇటుకలు 11వేల నుంచి రూ.12వేలకు రూ.1.20 లక్షలు ఖర్చవుతోంది. 10 నుంచి 12 ట్రాక్టర్ల ఇసుకకు రూ.75వేలు, కంకర రూ.40వేలు అవుతుంది. మేస్త్రీలు, కార్మికులకు కలిపి రూ.1.40 లక్షల నుంచి రూ.1.90 లక్షలు అవుతుంది. టైల్స్, ఫర్నీచర్, వైరింగ్, నీటి పైపులు, ట్యాంకు వసతులన్నింటినీ కలిపి ఖర్చులు సరే సరి. ఇలా మొత్తం రూ.12 లక్షల వరకు ఖర్చ వస్తుంది. ఇదే 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడేళ్లకు ముందు ఉన్న ధరలకు, ప్రస్తుతం చూసుకుంటే వ్యయం అదనంగా మరో రూ.4 లక్షల వరకు పెరిగినట్లే.

నిర్మాణ రంగంపై ప్రభావం



కరోనా ప్రభావంతో రెండేళ్లు పనులు లేక భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కరోనా పోయి సాధారణ పరిస్థితులు వచ్చాక భవన నిర్మాణ రంగం పనులు పట్టాలెక్కాయని అనుకుంటే.. ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా ఇసుక, సిమెంట్ ధరలతో పాటు, ఇనుము రేట్లు పెరిగాయి. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో భవన నిర్మాణాలకు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఈ ప్రభావం నిర్మాణ రంగంపై పడింది.

-ఎం.ఆదినారాయణమూర్తి,
భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమ్స్

- 8102 మంది హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డిఐజి హరికృష్ణ
- పర్యవేక్షించిన ఎస్‌పి జి.ఆర్.రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎస్ఐ ప్రిలిమ్స్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 9153 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 1051 మంది గైర్హాజరయ్యారు. వీరిలో పురుషులు 6432, మహిళలు 1670 ఉన్నారు. ఎస్‌పి జిఆర్.రాధిక ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ సందర్శించారు. పరీక్షల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత అదే పరీక్షా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద పరీక్ష పేపర్ల పంపిణీని ఎస్‌పి రాధిక స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర, అంబేద్కర్ యూనివర్సిటీతో పాటుగా శ్రీకాకుళం పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆమె సందర్శించారు. పరీక్ష సరళిని పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణ బాధ్యతలను అదనపు ఎస్‌పి టిపి.విఠలేశ్వర్, డిఎస్‌పి ఎం.మహేంద్ర, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎస్.బాలరాజు, ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాదరావులు నిర్వర్తించారు.



స్ట్రాంగ్ రూంలో పేపర్లను పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రవీణ్ ప్రకాష్ తీరు అభ్యంతరకరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులను అవమానించే రీతిలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలు, చర్యలు ఉన్నాయని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేర్కొన్నారు. పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను అవమానించే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఆదివారం పిఎస్ఎన్ఎం స్కూల్లో జరిగిన ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జులై నుంచి నూతన వేతన స్కేలు అమలు చేయాల్సి ఉందని, అందు కోసం తక్షణమే 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రవర్తిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ప్రవీణ్‌ప్రకాష్ వంటి అనుభవంగల అధికారి ఉపాధ్యాయులతో సామరస్య ధోరణిని అవలంబించాలని హితవుపలికారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా ఉద్దేశ పూర్వకంగా వేదించడం తగదన్నారు. ఇప్పటికే మానసిక ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ తీరు అభ్యంతరకరంగా మారిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రతి నెలా ఒకటవ తేదీకి జీతం ఇవ్వాలని, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ ప్రకటించిన దశల వారీ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు అంతకుముందు లేని నిబంధనలు అవలంబిస్తూ కోర్టు కేసుల పేరుతో తాత్సారం చేయడం సరికాదని, పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్లు పంపించడం సరైన విధానం కాదని, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడానికి చేస్తున్న పనులని విమర్శించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు, ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు బి.నేతాజీరావు, చావలి శ్రీనివాస్, రామ్మోహనరావు, వీరయ్య, ఎస్.చాణక్య, మక్క గంగేశ్వరి, గోపీకృష్ణ, శ్రీరామ్మూర్తి, సదాశివుని శంకరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘువర్మ

రెండు నెలల్లో విస్తరణ పనులు పూర్తి

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ పనులను మరో రెండు నెలల్లో పూర్తిచేసి సుందరంగా తీర్చిదిద్దుతామని, అదే రోడ్డుపై పాదయాత్ర చేస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రగతి భవన్ ఆవరణలో ఆదివారం గృహ సారథులు, బూత్ కన్వీనర్ల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైల్వే ఫ్లైఓవర్ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తే తాను అధికారం చేపట్టిన తరువాత పనులు ప్రారంభించామన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వీటిని త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. పలాసలో డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రతి మండలంలోనూ జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు పలాస నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించి, రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసేలా మీరు కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు, వైస్ ఛైర్మన్‌లు మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, పలాస అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డబ్బీర్ భవాని శంకర్, విప్ దుర్గాశంకర్ పండా, పలాస ఎఎంసి ఛైర్మన్ పివి.సతీష్, కౌన్సిలర్‌లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సోమవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జంబ్లింగ్ విధానంలో కాకుండా ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే ప్రయోగాలు నిర్వహించనున్నారు. అందుకోసం ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాల్లో 134 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణకు అన్ని కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఆర్ఐఒ, రాష్ట్ర ఉన్నతాధికారులు వారి కార్యాలయాల నుంచే పరీక్షలు జరిగే తీరును పర్యవేక్షించనున్నారు. సోమవారం నుంచి మొదలు కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో జనరల్ కోర్సులకు 26 నుంచి ప్రారంభం కానున్నాయి. వృత్తి విద్యకు మూడు, ఇతర కోర్సులకు రెండు విడతలుగా మార్చి 7వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లా ప్రాతిపదికన 134 కేంద్రాల్లో మొదటి రెండు రోజుల్లో 25,295 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఒకేషన్ కోర్సుల్లో 4103 మంది, ఎంపిసి, బైపిసి విద్యార్థులు 19,475 మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారు. ఒకేషన్ కోర్సులకు 39 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఇతర ప్రాక్టికల్ పరీక్షలకు 134 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్న 71 పరీక్షా కేంద్రాల్లో సొంత కాలేజీలకు చెందిన విద్యార్థులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆయా చోట్ల ప్రభుత్వ అధ్యాపకులను ముఖ్య పర్యవేక్షకులుగా నియమించారు. ప్రతి మూడు రోజులకూ ఒకసారి ఎగ్జామినర్లను మార్చనున్నారు.

గంట ముందే ప్రశ్నాపత్రం

ఉదయం 9 నుంచి 12గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రెండు విభాగాలుగా పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షా సమయం తర్వాత పది నిమిషాల వరకే అనుమతిస్తారు. హాల్ టికెట్, రికార్డు, ప్రాజెక్టు వర్క్‌తో రావాల్సి ఉంటుంది. లేకపోతే వాటికి కేటాయించిన మార్కులు మినహాయిస్తారు. వృత్తి విద్యకు 50, జనరల్ కోర్సులకు 30 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా పరీక్షా సమయానికి గంట ముందుగా ప్రశ్నా పత్రం వస్తుంది. ఫోన్‌కు వచ్చే ఒటిపి ఆధారంగా పర్యవేక్షకులు డౌన్‌లోడ్ చేసి, జెరాక్స్ తీసి అందజేస్తారు.



పర్యవేక్షణ బాధ్యతలు

ఆర్ఐఒ, డివిఇఒ, హైపవర్ కమిటీ(డెక్ సభ్యులతో), మూడు స్క్వాడ్ బృందాలతో పాటు ముఖ్య పర్యవేక్షకులు, ఎగ్జామినర్లు పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో వృత్తి విద్యకు సంబంధించి 134 మంది సిఎస్, ఎగ్జామినర్లను నియమించారు. జనరల్ కోర్సులకు ఎగ్జామినర్లను ఇంటర్ బోర్డు నేరుగా నియమిస్తుంది. ఈ నియామకాల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.

వసూళ్లకు తావులేదు

పరీక్షలకు ఎటువంటి అవకతవకలు తావులేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకున్నాం. కొన్ని రోజులుగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహించాం. ప్రశ్నాపత్రాల కోసం కళాశాలల్లో అంతర్జాల సదుపాయం, రెండేసి ప్రింటర్లు ఉండాలని ఆదేశించాం. విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తప్పవు. అటువంటి పరీక్షా కేంద్రాన్ని తక్షణమే రద్దు చేస్తాం

-శివ్వాల తవిటినాయుడు, ఆర్ఐఒ, శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా...!

- సిపిఎస్ రద్దుకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కృషి
- గిరిజన ప్రాంతంలో జిఒ 3 చట్టబద్ధతకు పోరాటం
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముందుంటా..
- 'ప్రజాశక్తి'తో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'వెనుకబడిన ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం జరుగుతోంది. వ్యవసాయం, వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో తగిన పురోగతిలేదు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధికి అవస్థలుపడుతోంది. రెగ్యులరైజేషన్ చేయక ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక వెతలుపడుతున్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75శాతం ఉద్యోగాల కల్పన జిఒ అమలు చేయడంలేదు. ఎన్ఎడిబి ఇతర నిర్వాసిత సమస్యలు పరిష్కరించడంలేదు. షెడ్యూల్ ప్రాంతంలో జిఒ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగాల భర్తీ చేయడంలేదు. ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దుచేయకుండా, రద్దు చేయాలని పోరాడుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కష్టకాలంలో ఆదుకొనేందుకు సంక్షేమబోర్డు వంటివి లేవు. ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రజల బాధనూ, ఘోషనూ, ఆవేదననూ, వివక్షనూ శాసనమండలిలో గొంతెత్తి, ఆయా తరగతుల సమస్యలపై పోరాడుతున్న శక్తులకు అండగా నిలబడతాను. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను' అని సామాజిక కార్యకర్త, 250 పైచిలుకు ప్రజా సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఎన్నికల అజెండా, విజయం సాధిస్తే కేంద్రీకరించి పనిచేసే అంశాలను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఉన్నత చదువులు చదివి, ఉద్యోగావకాశాలను వదులుకొని సామాజిక సేవను ఎందుకు ఎంచుకున్నారు ?

మా కుటుంబ నేపథ్యం అటువంటిది. గ్రామీణ వాతావరణంలో పెరగడం, చదువు పూర్తయ్యాక గిరిజన, నగర, శ్రామిక మహిళల సమస్యలను అధ్యయనం చేస్తూ, పరిష్కారం కోసం పనిచేశాను. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో అగ్రికల్చర్ బిఎస్‌సి పూర్తిచేశాక పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతంలో పనిచేశాను. కొండల్లో గిరిజనుల నివాసాలు, వారి భాషలు, సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతిపైనా ఆసక్తివుండడంతో గిరిజన ప్రాంతం ఎంచుకున్నాను. గిరిజన గూడెల్లో వారితోపాటు ఉంటూ జీడి మామిడి తోటల పెంపకంపై అవగాహన కల్పించడం, వారితో కలిసి తోటలు పెంపకంలో భాగస్వామి అయ్యాను. గుమ్మలక్ష్మీపురం ప్రాంతంలో నాణ్యమైన జీడిపిక్కల విత్తనాల కోసం పెద్ద పోరాటం నడిపి, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయించగలిగాను. 'మేనేజ్' అనే సంస్థ ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులో రంపచోడవరంలోని గిరిజన ప్రాంతంలో పనిచేసినప్పుడు గిరిజన వ్యవసాయంలో చిరుధాన్యాల పంటలకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేశాను. వివాహ రీత్యా విశాఖ నగరానికి రావడంతో.. ప్రభుత్వ ఉద్యోగం కాకుండా, పేదలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల్లో పనిచేయాలని అనుకున్నాను.



మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలేంటి?

వ్యవసాయం, వ్యవసాయ పనిచేస్తున్న వారితోవున్న అనుబంధం, అన్నయ్య, అక్క, తమ్ముడు విద్యార్థి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాల్లోనూ పనిచేయడం, దీనికితోడు బొబ్బిలి మండలం నారసింహునిపేట సర్పంచ్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన మా తాతగారు మర్రాపు పోతినాయుడు ప్రభావం నాపై బలంగా పడింది. బాల్యంలో ఆయన దగ్గర పెరగడం, చదవడంతో దళితులు, ఇతర సామాజిక తరగతులను ఆయన ప్రేమగా, సమానంగా చూడ్డం అతిసమీపం నుంచి చూశాను. ఉపాధ్యాయులు బాగుంటే, పిల్లలకు విద్యాబోధన బాగుంటుందని ఉపాధ్యాయులపై చాలా అభిమానం చూపేవారు. నా బాల్యం నుంచే ప్రభావితం కావడానికి ఇవన్నీ దోహదపడ్డాయి.



మీరు చేసిన ప్రధాన సేవా కార్యక్రమాలేంటి?

వివాహరీత్యా విశాఖ నగరానికి రావడంతో జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ధాన్ ఫౌండేషన్'లో రెండు దశాబ్దాలకుపైగా పనిచేశాను. నా ఆలోచనలకు తగినట్లే పేదరిక నిర్మూలన, రైతులు, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేసే క్రమంలో 33వేల మంది పేద మహిళలతో స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా సమాఖ్యలను ఏర్పాటు చేశాను. ఈ క్రమంలో బ్యాంకులు, ఇన్సురెన్స్, ఇతర ప్రభుత్వ సంస్థలు, ఆరోగ్య సంస్థలు, వృత్తి శిక్షణా సంస్థలతో అనుసంధానం చేసుకొని పేద మహిళలకు, వారి కుటుంబాలకు సేవలందించాను. అంగన్‌వాడీ, ఆశా, శ్రామిక మహిళలు పనిచేసే ప్రాంతంలో వారెదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా పనిచేశాను. మెటర్నిటీ లీవ్ సదుపాయం, లైంగిక వేధింపుల కమిటీలు, ప్రత్యేక మరుగుదొడ్లు వంటి ఏర్పాటు చేయగలిగేలా చేశాను. ఎస్ఇజెడ్‌లో గార్మెంట్ కార్మికుల సమస్యలపై పనిచేసినప్పుడు భారత ప్రతినిధిగా ఆసియా దేశాల్లో వారి సమస్యలపై మాట్లాడాను. నా జీవిత భాగస్వామి డాక్టర్ బి.గంగారావు ప్రజలకు సేవచేసే వ్యక్తి కావడంతో నా సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాను. 2010 నుంచి మురికివాడల్లోని పేద కుటుంబాల పిల్లల కోసం వైజాగ్ చిల్డ్రన్ క్లబ్(విసిసి) ఏర్పాటు చేశాను. పిల్లల్లో సమిష్టితత్వం పెంచడం, సామాజిక స్పృహ, శాస్త్రీయ ఆలోచనలు వారిలో పెంపొందించడం సంతృప్తినిచ్చాయి. పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నాం.

మీ ఎన్నికల ప్రచార అజెండా ఏంటి?

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే ప్రధాన ప్రచార ఎన్నికల అజెండా. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిలో ఈ ప్రాంతం వెనుకబడివుంది. వ్యవసాయం అభివృద్ధి చెందకపోవడంతో వెనుకబాటుతనం కొనసాగుతోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీ అమలుచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చిన్ననీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి. కొత్త పరిశ్రమలు రావాలి. ఐటి హబ్‌ని అభివృద్ధి చేయాలి. ఇవి కాకుండా అనేక సమస్యలు సుదీర్ఘకాలంగా వున్నాయి. వీటన్నింటినీ పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్తున్నాను.

మీరు విజయం సాధిస్తే ఏ సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తారు?

నా అభ్యర్థిత్వాన్ని బలపర్చి పనిచేస్తున్న 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజాసంఘాల సమస్యలు పరిష్కారానికి, ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీకి కృషి చేస్తాను. విభజన చట్టం హామీల అమలుకు కృషిచేస్తాను. పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీ పూర్తికి, మెట్రో రైల్, రైల్వే జోన్‌పై మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా జరుగుతున్న పోరాటాలకు అండగా ఉంటాను. సొంత గనులు సాధనకు కృషి చేస్తాను. సిపిఎస్ రద్దుకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు అండగా నిలుస్తా. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీకి కృషి చేస్తాను. సెజ్‌లో పరిశ్రమలకు రాయితీలు కల్పించినట్లు, ఉపాధి కేంద్రాలుగా ఉన్న చిన్నచిన్న విద్యా సంస్థలకు రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరుతా. గిరిజన ప్రాంతంలో జిఒ 3 ప్రకారం ఉద్యోగాల భర్తీచేయాలి. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసేలా పట్టుబడతాను. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తా. విశాఖలో పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తాను. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై ఉత్తరాంధ్ర ఆడపడుచుగా నీతి, నిజాయతీ, నిబద్ధతతో మండలిలో పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాను.

చక్రతీర్థ స్నానాలకు పటిష్ట బందోబస్తు

డిఎస్‌పి శివరామిరెడ్డి

ప్రజాశక్తి - జలుమూరు

మండలంలో సోమవారం నిర్వహించే శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి ఎం.శివరామిరెడ్డి తెలిపారు. ఆదివారం చక్రతీర్థ స్నానాలు చేయనున్న మిరియాబెల్లి వంశధార నదీ తీరాన్ని, అక్కడకు వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి చక్రతీర్థ స్నానాల్లో బందోబస్తు నిర్వహించనున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగంలో ప్రతి రోజూ 280 మందితో బందోబస్తు నిర్వహించామని, చక్రతీర్థ స్నానాలకు అదనంగా మరో 140 మందిని నియమించినట్లు చెప్పారు. మొత్తం 620 మందితో పది రోప్ పార్టీలు ఏర్పాటు చేశామని అన్నారు. చక్రతీర్థ స్నానాలకు నాలుగు రోప్ పార్టీలు, సరుబుజ్జిలి వైపున 200 మంది పోలీసులు, ఆరు రోప్ పార్టీలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఆయనతోపాటు నరసన్నపేట సిఐ డి.రాము, ఎస్ఐ పి.పారినాయుడు తదితరులు ఉన్నారు.



అత్మీయుల నుంచి సత్కారాన్ని అందుకుంటున్న దేవి

జిబిటి మిస్ ఇండియాకు సన్మానం

అభినందించిన స్నేహితులు, బంధువులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్లోబల్ బ్యూటీ ట్రైబర్ పోటీల్లో మిస్ ఇండియాగా నిలిచిన దివకల దేవి శ్రీకాకుళం చేరుకున్నారు. నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఆమెను తల్లిదండ్రుల సమక్షంలో స్నేహితులు ఆదివారం అభినందన సభ నిర్వహించి సన్మానించారు. హైదరాబాద్‌లోని తాజ్ బంజారాలో ఈ నెల 13 నుంచి నాలుగు రోజుల పాటు గ్లోబల్ బ్యూటీ ట్రైబర్ సంస్థ ఈ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వంద మందికిపైగా యువతులు పాల్గొని తమ అందాలను, ప్రవర్తన, సమాజంపై వారికున్న విశ్వాసం, మేధాసంపత్తి తదితర అంశాలపై పోటీ కొనసాగింది. ఈ పోటీల్లో అన్నింటా తానై నెగ్గిన దేవి మిస్ ఇండియాగా నిలిచింది. తల్లిదండ్రులు ఉద్యోగ రీత్యా విశాఖలో ఉంటున్నారు. సొంత ఊరు శ్రీకాకుళం అని ఆమె గొప్పగా చెప్పుకొచ్చారు. ఈ పోటీ సమయంలో మానసిక ఒత్తిడి గురయ్యానని, ఆ సమయంలో అమ్మ అందించిన సహకారం ఎంతో విజయానికి తోడ్పాటు అందించిందని పేర్కొన్నారు. అవకాశాలు వస్తే భవిష్యత్‌లో సినిమా రంగం వైపు వెళ్తానని దేవి చెప్పారు. కార్యక్రమంలో మావూరి కృష్ణారావు, వాసుదేవరావు, అను, పద్మజ మావూరు పాల్గొన్నారు.

అరసవల్లిని సందర్శించిన ఎంపీ

శ్రీకాకుళం అర్బన్ : పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబ సమేతంగా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఇఒ వి.హరిసూర్యప్రకాష్ స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.5.95 లక్షల ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాఘమాసం చివరి ఆదివారం కావడంతో సాధారణ రద్దీ కొనసాగింది. ఆలయానికి టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,68,500, విరాళాల రూపంలో రూ.77,000, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2,50,000 ఆదాయం సమకూరినట్లు ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.



జ్ఞాపికను స్వీకరిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి పనిచేస్తా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి పనిచేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ తెలిపారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లోనూ వెనుకబడిందన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా అమలుచేయలేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీకి రూ.24 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నా కేంద్రం రూ.450 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తున్నా రాష్ట్రంలో వైసిపి, టిడిపి అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన ప్రాంతంలో జిఒ 3ను రద్దు చేయడం గిరిజనులకు అన్యాయం చేయడమేనని చెప్పారు. విశాఖ రైల్వేజోన్, మెట్రోరైల్, సుజలస్రవంతి, గిరిజన యూనివర్సిటీ హామీలు గాలికి వదిలేశారని విమర్శించారు. జాబ్ కేలండర్ అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదని తెలిపారు. అరకొర పిఆర్‌సి అమలు చేసి ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికుల సమస్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రశ్నిస్తున్నారని గుర్తుచేశారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. తనకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆమె పట్టభద్రులకు విజ్ఞప్తిచేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సభ్యులు వై.స్వామినాయుడు, ఎ. శ్రీనివాసరావు, బి.రమేష్, పి.సత్యనారాయణ, ఎం.శశిభూషణరావు, కె.రామకృష్ణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాప్రభ

రమాప్రభను గెలిపించాలి

టెక్కలి : శాసనమండలిలో ప్రజా గళం వినిపించేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య కోరారు. ఈ మేరకు పట్టణంలోని పలు వీధుల్లో ఆమె ఓటర్లను ఆదివారం కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్యయుతంగా పోటీ చేస్తున్న రమాప్రభ విజయం ప్రస్తుత తరుణంలో అవసరమని పేర్కొన్నారు. సైద్ధాంతిక భావజాలంతో కట్టుబడి ఉన్న ఆమె విజయం భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకే వేయాలని కోరారు. ఈయనతో పాటు యుటిఎఫ్ నాయకులు పొట్నూరు జగదీష్, తమ్మినేని వైకుంఠరావు, మారం కుమారస్వామి, రోణంకి విజయకుమార్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం



పోటీలను పరిశీలిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఆదివారం 12వ జిల్లాస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ మెలిగి విజయాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. తైక్వాండో ఆత్మరక్షణగా కూడా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారికాప్రసాద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని, క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తైక్వాండో ఆఫ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కొమర భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారికి మార్చి 10,11,12 తేదీల్లో విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. సబ్‌జూనియర్ బాలురు విభాగంలో 12, బాలకల విభాగంలో 12, కెడిట్ విభాగంలో బాలురు విభాగంలో 10, బాలికల విభాగంలో 10, జూనియర్స్ బాలికల విభాగంలో 10, బాలురు 10 విభాగాల్లో సుమారు 180 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నట్టు వివరించారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా శ్రీకాకుళం జట్టు

నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన 12వ జిల్లా స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ఓవరాల్ ఛాంపియన్ కైవసం చేసుకుంది. శ్రీకాకుళం క్రీడాకారులు 29 గోల్డ్, 10 సిల్వర్, 14 బ్రాంజ్ మెడల్స్‌తో సత్తా చాటారు. కొత్తూరు రన్నరప్‌గా నిలవగా, సోంపేట తృతీయ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ పి.సుందరరావు, పిఇటి, పీడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, విజయనగరం ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి సిహెచ్.వేణుగోపాలరావు చేతుల మీదుగా విజేతలకు పతకాలను అందజేశారు. బంగారు పతకాలు సాధించిన 39 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి క్రీడాకారులకు వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, పిఇటి సంఘం జిల్లా అధ్యక్షులు పి.వి.రమణ, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ప్రొఫెసర్ విష్ణు మూర్తి, శాసనపు జోగినాయుడు, శివకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి



ప్రమాదానికి గురైన లారీ

మండలంలోని జాతీయ రహదారి గట్లపాడు సమీపంలో యంతేద్ర కోల్డ్‌స్టోరేజ్ ఎదురుగా ఆదివారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్ జిల్లా, కొర్లుర్ గ్రామానికి చెందిన షేక్ ఆజాముద్దిన్ (32) డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ జూబిర్‌కు ఎడమ కాలువకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కటక్ నుంచి ఆధోనికి సేమ్యాలోడుతో వెళ్తున్న లారీ గట్లపాడు గ్రామ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వెళ్తున్న కంటైనర్ లారీని ఓవర్‌టెక్ చేసే సమయంలో అదుపు తప్పి ఢీకొంది. దీంతో లారీ ముందుగా కంటైనర్‌లోకి దూసుకుపోవడంతో డ్రైవర్ ఆజాముద్దిన్ అక్కడకక్కడే మృతి చెందగా, కీనర్ జూబిర్ ఎడమ కాలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలులో జిల్లావాసి మృతి



మోహనరావు (ఫైల్)

జలుమూరు: మండలంలోని దోమనాపల్లికి చెందిన ఎఆర్ కానిస్టేబుల్ మెండ మోహనరావు (26) ఆదివారం సంభవించిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. హైదరాబాద్‌లో ఎఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మోహనరావు కర్నూలులో ఎస్ఐ పరీక్ష రాసేందుకు రైలులో వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కింద పడటంతో శరీర భాగాలు రెండుగా వేరై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలియడంతో తండ్రి శోభన్‌రావు, తల్లి రాము కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మోహనరావు 2020లో తెలంగాణ ఎఆర్ పోలీస్‌గా ఎంపికయ్యారు. తమను పెంచి పోషిస్తాడు అనుకున్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

హరిశ్చంద్రపురం సర్పంచ్‌కు మాతృవియోగం



నరసమ్మ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సర్పంచ్ గురువెల్లి కేశవరావు తల్లి నరసమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దీంతో స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, ఎంపిటిసిలు బగాది దివాకర్, పూజారి సత్యం, సింగూరు వాసు, బమ్మిడి శ్రీనివాస్‌లు అమె అంత్యక్రియలో పాల్గొన్నారు. అలాగే మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణ, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

వై.వి.ఆర్ మృతికి సంతాపం

టెక్కలి : ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు యలమంచిలి వెంకటేశ్వరరావు మృతికి ఇయు సంఘానికి తీరని లోటని డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్.ఎం.రావు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలపై, కార్యక్రమాలపై వై.వి.రావు చూపిన మార్గం పోరాటాలకు విజయాలన్నారు. ఆర్‌టిసి కార్మికులు సాధించుకున్న హక్కుల సాధనలో వై.వి.రావు కృషి కొనియాడ దగ్గదని పేర్కొన్నారు. సంతాపాన్ని వ్యక్తం చేసిన వారిలో మురళి, డి.ఎస్.ఆర్.మూర్తి, కోకిల ధర్మారావు, వైఎస్ఆర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జి.నాగభూషణం ఉన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జాడుపల్లి మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తుండగా... గాయపడి మృతి చెందిన వంట కార్మికురాలు మల్లిపెద్ది రమ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎండిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు మహాలక్ష్మి, మండల అధ్యక్షులు బి.ఉత్తర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో వంట కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న వంట చేస్తుండగా రమ దుస్తులకు నిప్పంటుకుని గాయపడిందని, కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులు వంట చేస్తున్న ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వంట ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవిస్తే ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కె.సుశీల, సీతమ్మ, శోభారాణి, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, తులసమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, కాంతమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వంట కార్మికులు

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశభక్తికి, పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ నిలుస్తారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని శాంతి నగర్ కాలనీ జాతిపిత మహాత్మాగాంధీ మందిరం భారత స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తివనంలో శివాజీ 393 జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి సాధారణ కుటుంబంలో జన్మించిన శివాజీ తల్లి అందించిన స్ఫూర్తితో ఛత్రపతిగా ఎదిగారన్నారు. దేశభక్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన శివాజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గాంధీ భవనం అధ్యక్షులు డాక్టర్ కృష్ణమోహన్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పొన్నాడ రవికుమార్, ఇందిరాప్రసాద్, డాక్టర్ విష్ణు, మహిబుల్లాఖాన్, హారికాప్రసాద్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, లుకలాపు గోవిందరావు పాల్గొన్నారు.

లావేరు : మురపాక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాజీ 1 630 ఫిబ్రవరి 19న పూణే జిల్లా జున్నార్ పట్టణం శివనేరి కోటలో షాహజీ జిజియాభాయ్ దంపతులకు జన్మించారని అన్నారు. చిన్నతనం నుంచే యుద్ధ తంత్రాల్లోనే కాకుండా పరిపాలన విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగన్యుడని అన్నారు. శివాజీని విద్యార్థులు ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, పాఠకులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఘనంగా దుర్యోధన రెడ్డి జన్మదినం



దుప్పట్లను పంపిణీ చేస్తున్న దుర్యోధనరెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బెన్నిగానిపేటలో 30 మంది భవన నిర్మాణ కార్మికులకు సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ షుస్ పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో 60 మంది కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అందులో 22 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కేశ్వరం పంచాయతీ నేలపుట్టిలో వంది మందికి పైగా వైద్యులతో కిడ్నీ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు, ఇసుకలపాలెం సర్పంచ్ బైపల్లి ఈశ్వర్, మత్స్యకార విభాగ కార్యదర్శి హరి బెహెర, మున్సిపాలిటీ వార్డు ఇన్‌ఛార్జిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎంజిఆర్ ఆర్థికసాయం



పాతపట్నం : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

పాతపట్నం : పాతపట్నం మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన కొనపల అప్పారావు, బాల దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి వివాహానికి టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు ఆదివారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆ కుటుంబానికి భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చిన నేనున్నానని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ధనుపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, దారపు యతేశ్వరరావు, మామిడి రవికుమార్, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబూరావు, గొట్ట మాజీ సర్పంచ్ చాపల రామారావు, బోను వెంకటరమణ, వంబవిల్లి ప్రతాప్, కుంచాల బాలకృష్ణ, పంగ కృష్ణారావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి...

మెళియాపుట్టి : మండలంలో సంతలక్ష్మీపురానికి చెందిన రంధి దామోదర్ కిడ్నీ బాధితునికి పదో తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.22 వేలు ఆర్థికసాయం అందజేశారు. సహచర పదో తరగతి విద్యార్థి బృందం ఆయన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, రామారావు, కుమారస్వామి, హరికృష్ణ, రాధాకృష్ణ, నిర్మల కిషోర్, ఆనందరావు. పురుషోత్తం, కుమారస్వామి, హేమసుందర్, జయంత్, జగ్గారావు, లచ్చయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు


రైతుల ఆందోళన

లావేరు: మండల కేంద్రం లావేరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా కాకా పంటలు ఎండిపోతున్నాయని, కొన్ని నెలలుగా ఇదే సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నమని అన్నారు. విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే స్పందించాలని నినాదాలు చేశారు. రోజులో కనీసం గంటైనా విద్యుత్ సరఫరా కావడం లేదని వాపోయారు. ఇంతవరకు లావేరు ఉపకేంద్రం నుంచి సరఫరా అయ్యే విద్యుత్, ఇటీవల అధికారులు బుడుమూరు విద్యుత్ ఉపకేంద్రానికి మార్చడంతో సక్రమంగా సరఫరా కావడం లేదని అన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని, దీనివల్ల తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోతే తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుని పట్టుబట్టారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

జెడ్‌పిటిసి పరామర్శ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రామ్‌శెట్టి పాపారావు కుటుంబ సభ్యులను జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తక జోగారావు ఆదివారం పరామర్శించారు. పాపారావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సమాచారం తెలుసుకున్న జెడ్‌పిటిసి దంపతులు పాపారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.



పరామర్శిస్తున్న యశోద

నవధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నవధాన్యాలు సాగు నేల తల్లికి బాగుపై మండలంలోని లక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఎస్‌డి ఎ.పి.సింహాచలం ఆధ్వర్యాన రైతులు ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వారికి ఉన్న పొలాల్లో పంట కోసిన అనంతరం 18 నుంచి 30 రకాల విత్తనాలతో ఎకరానికి 12-13 కేజీలు జల్లుకోవడం ద్వారా నేలలో భూసారం పెరుగుతుందన్నారు. తరువాత వేసే పంటలో దిగుబడి పెరుగుతుందన్నారు. 30 రకాల విత్తనాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, పప్పు ధాన్య విత్తనాలు, ఆకుకూరల విత్తనాలు, కాయగూరల విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు (మెంతులు, ఆవాలు కొత్తిమీర) ఎకరానికి 12 కేజీలు వేసి 45 రోజుల వరకు పెరగనివ్వాలన్నారు. పెరిగిన పైరును పశువులకు దాణాగా వేసి, మిగిలిన పంటను కలియదున్నాని పేర్కొన్నారు. దాని ద్వారా నెలలో స్థూల, సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. తరువాత వేసే పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం కె.ఉష, డిజిటల్ ఐసిఆర్‌పి కె.సూర్యారావు, టి.విజయ పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

అలరించిన కోలాటం



పొందూరు : కోలాటం చేస్తున్న మహిళలు

రణస్థలం రూరల్ : కళలను ప్రోత్సహించాలని లావేరు మండలం డిటి డి.నారాయణమూర్తి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యాన కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రణస్థలం, లావేరు మండలాల నుంచి సుమారు 10 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నారాయణమూర్తి, రణస్థలం సీనియర్ డ్యాన్స్ మాస్టర్ టంకాల వాసు వ్యవహరించారు. మొదటి బహుమతి బంటుపల్లి టీమ్‌కు రూ.5 వేలు, రెండో బహుమతి తిరుపతిపాలెం టీమ్‌కు రూ.3 వేలు, లావేరు మండలం అగ్రహారం టీమ్‌కు రూ.2 వేలు నగదు బహుమతులు, మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వెలిచేటి సురేష్‌కుమార్, రాయుడు, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిచేటి సుధాకర్‌కుమార్, రాజశేఖర్, కమిటీ సభ్యులు పిసిని అసిరప్పుడు, అప్పలనాయుడు, ముంగం చిన్నరావు, రమణ, గోపిన కృష్ణారావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాకలో వరలక్ష్మి అమ్మబాల పేరంటాలు తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన మహిళల కోలాటం నృత్యం చూపరలను ఆకట్టుకుంది. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ యాత్ర మహోత్సవాలకు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పురజనులు పాల్గొన్నారు.

'ఒక్క ఛాన్స్ అంటూ దోచుకుంటున్నారు'



మందస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస/మందస

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం... ప్రజలకు అండగా ఉంటామని... ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, కొండలు గుట్టలు చెరువులు వాగులు సైతం ఆక్రమించుకుంటున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. మందస మండలం సిద్ధిగాం పంచాయతీ పింపిడియాలో ఆదివారం టిడిపి ఆధ్వర్యాన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి పోస్టర్లను పంపిణీ చేశారు. సమావేశానికి ముందు నందమూరి తారక రత్న మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధినేత, ప్రధాన ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు సభలను అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్తున్న చంద్రబాబుని పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. పలాస నియోజకవర్గంలో పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు వైసిపి నాయకులు కొండలు, గుట్టలు, చెరువులు ఆక్రమించి దోచుకుంటున్నారని ఆరోపించారు. మందస మండలం నల్లబొడ్డులూరు కొండనే మింగేసినా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కోట్లాది రూపాయల విలువచేసే కంకర సైతం అమ్ముకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.కె.నాయుడు, మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు తమ్మినేని ధనుంజయ, బమ్మిడి కర్రయ్య, వెంకటరావు, కొర్రయి శ్యామ్, షణ్ముఖరావు, రాజాన మహేష్, తులసీరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సైకో పాలన పోవాలని... సైకిల్ పాలన రావాలని టిడిపి జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోనెపాడులో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ... పోస్టర్లను అందజేవారు. నాలుగేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలు నెత్తిన వేసిన భారాలు, నిత్యవసరాల వస్తువుల ధరలు పెరుగుదల, రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర వివరాలను మహిళలను అడిగి వారి నుంచే సమాధానాన్ని రాబట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆంబళ్ల రాంబాబు, శివ్వాల సూర్యం, పల్లి సురేష్, సీపాన చంద్ర మూర్తి, మామిడి తిరుమలరావు, మెట్ట అనంత, కూన సంజయ్, ఎండ రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మెళియాపుట్టి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆదివారం అన్నారు. మండలంలోని కేరాసింగి పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ... పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైల లక్ష్మయ్య, మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, ఉర్లాన వసంత్, రామ్మోహన్, పరమేశుపాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నీలవేణి

42 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పోలాకి

ప్రజలకు వైద్యులు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంతలక్ష్మీపురం సర్పంచ్ యారబాటి నీలవేణి సూచించారు. ఈ మేరకు శ్రీరామ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. 42 మందికి కంటికి సంబంధించిన వివిధ రకాల ఇబ్బందులు ఉన్న రోగులును వైద్యులు మోహనకృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరమైన వారిని 15 మందిని, దృష్టి లోపం ఉన్న వారిని ఏడుగురిని గుర్తించారు. వీరికి కంటి అద్దాలను సూచించారు. శుక్లాల ఆపరేషన్ చేసుకుంటామని, వారికి శంకర్ ఫౌండేషన్ వారి ద్వారా ఉచితంగా చేయిస్తామని తెలియజేశారు. మరి కొంతమంది ఇతర రోగులకు అవసరమైన మందులు, ఐ డ్రాప్స్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ, టెక్నీషియన్ శ్రీరామ్ పాల్గొన్నారు.


జీవామృతం వేస్తున్న రైతు చిరంజీవిరావు

జీవామృతం పిచికారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయం చేసేలా సాగును మరింత విస్తీర్ణంలో విస్తరింపచేయడానికి తగు సూచనలు సలహాలను అందించారు. ప్రకృతి సాగు రైతు నక్క చిరంజీవి తన సొంతానికి చెందిన చెరుకు పంటలో వెయ్యి లీటర్ల జీవామృతాన్ని ఆదివారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పంటలో ప్రతి ఏడు నుంచి పది రోజులు వ్యవధిలో ఈ విధంగా జీవామృతం వేసుకోవడంతో నేలలో పంట ఎదుగుదలకు అవసరమైన అన్ని ముఖ్యమైన సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమి పూర్తిగా సారవంతంగా మారుతుందన్నారు. బయట దొరికే ఎరువులు ఈ జీవామృతం దగ్గర దేనికీ పనికిరాదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిపేటలో అన్నదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేటలో అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని కన్నుల పండుగగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పరిసర గ్రామాలను యాత్రికులు తరలివచారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొండు రమణ మాట్లాడుతూ ఏటా ఇదేవిధంగా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొండు శ్యామలరావు, భాస్కరరావు, కృష్ణారావు, రవి, గురుగుబెల్లి చలపతిరావు, శ్యామలరావు, చింతాడ రాజు, గోపాలరావు, పైడి హరీష్, ముగడ నాగరాజు పాల్గొన్నారు.

కరాపాడులో...

కవిటి: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కరాపాడులో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని రామలింగేశ్వ ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

ఉత్తమ క్రమశిక్షణే విజయానికి సోపానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉత్తమ క్రమశిక్షణ విజయానికి సోపానమని వంశధార ప్రాజెక్టు టెక్కలి డివిజన్ కార్యనిర్వహ ఇంజినీర్ కె.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పూండిలో ఉన్న సాయి వినీత్ విద్యా సంస్థలు వ్యవస్థాపక డైరెక్టర్లు, విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ చాపర లీలాకోదండరావు అధ్యక్షతన ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆదిఆరం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో బాలికల విద్య మధ్యలో ఆగిపోకుండా కొనసాగుతుందని, దానికి కారణం సాయి వినీత్ విద్యా సంస్థల ముందు చూపే కారణమని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించడం, నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు



మాట్లాడుతున్న శ్రీకాంత్

పలు జానపద సినీ గేయాలకు నృత్యాలు చేసి అలరించారు. వీడ్కోలు చెప్పుకునే సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ చాపర కోదండరావు, కళాశాల ప్రిన్సిపాల్ లండ ధనరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, అధ్యాపకులు బచ్చల ధర్మారావు, షణ్ముఖరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుధాకర్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంగ్ల ఉపాధ్యాయులు నళిని సుధాకర్ అంతర్జాతీయ స్థాయిలో నడక పోటీల్లో విజేతగా నిలుస్తూ... జిల్లా కీర్తి ప్రతిష్టలు ఖండాంతరాలకు చాటుతున్నారని స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పలు స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్, లయన్స్‌క్లబ్, సెంట్రల్, రోటరీ, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల ప్రతినిధులు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా సుధాకర్ నిత్యం వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ నడక ద్వారా కలిగే ప్రయోజనాలు ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి అని కొనియాడారు. పైసా ఖర్చు లేని వ్యాయామం నడక అని, అనేక రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందని అన్నారు. నడకతో సంపూర్ణ ఆరోగ్యం


సన్మానిస్తున్న ప్రతినిధులు

సాధ్యమంటూ సుధాకర్ చేపట్టిన యాత్ర విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు కలకత్తాలో నిర్వహించిన 42వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ నడక పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి పొందారని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ ప్రతినిధులు హరికాప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, వావిలపల్లి జగన్నాథనాయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, మాజీ గవర్నర్ పి.జి.గుప్తా, సింహాద్రి వేణుగోపాల్, రత్నాల వరప్రసాద్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా వత్సవలస యాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని గార మండలం వత్సవలసలో ఏటా మాఘమాసంలో వచ్చే ఆదావారాల్లో నిర్వహించుకునే శ్రీరాజరాజేశ్వరి యాత్ర ఘనంగా సాగింది. ఈ ఉత్సవాలకు జిల్లాలోని వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి రాత్రి అక్కడే బసవేస్తారు. మరుసటి రోజున వేకువ జామున సముద్ర స్నానాలు ఆచరించి అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి


తరలివచ్చిన యాత్రికులు

నుంచి భారీగా వాహనాలతో తరలివచ్చారు. ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలతో వత్సవలస చేరుకున్నారు. వేడుకల్లో గంగిరెద్దులు, పాములను ఆడించేవారు, ఇతర కళాకారులు తమతమ సాంప్రదాయ నృత్యాలను, వీధి నాటకాలను ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ నుంచి 500 మంది పోలీసులను నియమించారు. ప్రధాన రహదారైన శ్రీకూర్మం, మొగదలపాడు రోడ్డులో వాహనాలను క్రమబద్ధీకరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనాలను దారిమళ్లించారు. ఆర్‌టిసి ఈ యాత్రకు ప్రత్యేక బస్‌లను ఏర్పాటు చేయడంతో ఆదాయాన్ని సమకూర్చుకుంది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన గార, కళింగపట్నం, శ్రీకూర్మం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

పలాస : మండలంలోని గంగువాడకు చెందిన పైల నాగమ్మ, పెదంచలకు చెందిన పొందర మోహనరావు, పొందర అప్పారావు, పిన్నింటి లింగరాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణ్ కుమార్, పోలాకి పోలారావు, అవుగాన దశరథ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు పూర్తి చేయాలి

టెక్కలి : టెక్కలి పంచాయతీరాజ్ రోడ్డులోని సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న కల్వర్టు పనులను తక్షణమే పూర్తి చేసి రవాణాకు ఆటంకం లేకుండా చూడాలని పట్టణ సామాజిక విభాగం నాయకులు హనుమంతు ఉదయ్ భాస్కర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజా ప్రయోగ పనులు దృష్ట్యా కల్వర్టు పనులు చేయడం హర్షణీయమని అన్నారు. కానీ, రెండు వారాలు గడుస్తున్నా ఇంకా పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహన దారులు, పాదచారులు, చిల్లర వ్యాపారస్తులు పలు ఇక్కట్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమైన రహదారి కావడంతో త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడం గమనార్హమన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు ఆలస్యమవుతుందని తెలిపారు.

శాంతారాంకు జాతీయస్థాయి ఉత్తమ సేవా అవార్డు



అవార్డును అందుకుంటున్న శాంతారాం

ప్రజాశక్తి- పొందూరు

సామాజిక సంఘ సేవకులు కాళ్లకూరి శాంతారాంకు జాతీయ ఉత్తమ సేవా అవార్డు లభించింది. కర్ణాటక రాష్ట్రంలోని హాస్పేట్‌లో నిర్వహించిన సిటిజన్ ఫోరమ్ అండ్ ఫ్రైడ్ ఇండియా కల్చరల్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ, వివేకానందుని అవార్డును శ్రీకృష్ణదేవరాయుల వంశస్థులు లలితారాణి ఆదివారం అందజేశారు. ఈయన 1974 నుంచి యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ వ్యవస్థాపకుల్లో ఒకనిగా ఎన్నో సంఘ, సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో గ్రామాల్లో తిరుగుతూ విరాళాలను సేకరించి బాధితులకు అందజేస్తుంటారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుంటారు. ఇటీవల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గవర్నర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. ఈ అవార్డు పొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.


విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం'

పలాస: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో ఆదివారం టిడిపి ఆధ్వర్యాన ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తుంటే ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. అనపర్తిలో ఏడు కిలో మీటర్లు రాత్రి సమయంలో పాదయాత్ర చేస్తూ ప్రజల వద్దకు వెళ్తుంటే... జెడ్ ప్లస్ కేటగిరి ఉన్న వ్యక్తికి పోలీసులు సెక్యూరిటీ ఇవ్వక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కావాల్సిన ప్రభుత్వమే ఇటువంటి దారుణాలకు పాల్పడడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎంపిటిసి గరుగు సింహాచలం, వడ్డీ యాదగిరి, రఘు పాత్రని సుదర్శన రావు, ఆళ్ల వెంకటరావు, గోరు వాసుదేవరావు, బమ్మిడి ఆనంద్, యర్ర వెంకట్, తిరుపతిరావు, వంకల కూర్మారావు, ఒరియా మోహనరావు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

ఎచ్చెర్ల : మండలంలోని వెంకటాపురం-యాతపేట రోడ్డు అధ్వానంగా ఉంది. సుమారు 25 ఏళ్ల క్రితం రోడ్డును నిర్మించడంతో ప్రస్తుతం రాళ్లు తేలిపోయాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

తారకరత్నకు నివాళి

టెక్కలి : నందమూరి వంశానికి చెందిన తారకరత్న మృతిపై టిడిపి నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. తారకరత్న మృతి వారి కుటుంబానికి సినీ లోకానికి తీరని లోటని అన్నారు. సంతాపాన్ని వ్యక్తం చేసిన వారిలో మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పార్టీ నాయకులు మట్ట పురుషోత్తం, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, మెండ దమయంతి, బెహరా కాళీ, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్, జీరు వెంకటరెడ్డి, గండి చంద్రరావు, బగాది సునీల్‌కుమార్, పెదరట్టి మణిఉన్నారు.

అలాగే స్థానిక సుదర్శన థియేటర్ వద్ద ఉదయం తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ, మేనేజర్ బాలకృష్ణ, రామకృష్ణ, జానీ పాల్గొన్నారు.

పలాస : నందమూరి తారక రత్న మృతి కుటుంబానికి


పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వెంకన్న చౌదరి

తీరని లోటని టిడిపి నాయకులు వెంకన్న చౌదరి అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో తారక రత్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, కొవ్వూరు సురేష్, జోగ మల్లి, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పెద్దపేటలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు అనేపు రామకృష్ణ, టిడిపి కార్యకర్తలు సినీ నటుడు నందమూరి తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


కుట్టు మిషన్లను అందజేస్తున్న రజత్‌కుమార్

కుట్టుమిషన్లు అందజేత

పొందూరు: మండలంలోని లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశాదీవెన టైలరింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన 31 మంది మహిళలకు ఆదివారం సంస్థ డైరెక్టర్ డాక్టర్ రజత్‌కుమార్ పాణి కుట్టుమిషన్లు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, సంస్థ కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, కుట్టు శిక్షకులు ఎ.రూప, సిబ్బంది మోహన్, ఉగాది, శ్రీను, స్వాతి పాల్గొన్నారు.